సాక్షి శ్రీకాకుళం

శుక్రవారం । 11 । జూలై । 2025



నీ చరణమే మా శరణమై

ఆనందపురం గురువారం సాయిమయమైంది. గురు పూర్ణిమ సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ప్రత్యేక పూజలు చేశారు.

– జి.సిగడాం



ప్రమాదం అంచున..

ఆటో ప్రయాణాలు అపాయకరంగా మారుతున్నాయి. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుంటున్నారు. – 8లో

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మున్సిపల్ విభాగంలో సిక్కోలు నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మున్సిపల్ విభాగ కమిటీలో శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఇద్దరికి చోటు కల్పిస్తూ పార్టీ కార్యాలయం నుంచి ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ మేరకు రాష్ట్రకార్యదర్శిగా ఇచ్ఛాపురం నియోజకవర్గం నుంచి సుగ్గు ప్రేమ్‌కుమార్, సంయుక్త కార్యదర్శి నీలాపు లక్ష్మిలను నియమించారు.

న్యూస్‌రీల్

గిరిజన మహిళా సర్పంచ్‌కు అవమానం



జన్ని సంధ్యారాణి

సారవకోట: మండలంలోని చిన్నకిట్టాలపాడు గిరిజన మహిళా సర్పంచ్ జన్ని సంధ్యారాణికి గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అవమానం ఎదురైంది. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తనను అవమానించినట్లు ఆమె తెలిపారు. గురువారం జరిగిన తల్లిదండ్రుల సమావేశానికి ప్రొటోకాల్ ప్రకారం పిలవాల్సి ఉన్నా తనను ఆహ్వానించలేదని తెలిపారు. ఈ పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాఠశాలలో ఏ కార్యక్రమం చేపట్టినా తనను ఆహ్వానించడం లేదని ఆమె ఆరోపించారు. దీనిపై ఎంపీడీఓ మోహన్, ఎంఈఓ ఎంవీ రమణ, కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

కుడి ప్రధాన కాలువకు నీరు విడుదల

హిరమండలం: వంశధార గొట్టా బ్యారేజీ కుడి ప్రధాన కాలువకు సాగునీరు విడిచిపెట్టినట్లు డీఈ బి.సరస్వతి గురువారం తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గొట్టా బ్యారేజ్‌లో 38.10 మీటర్లు నీటి మట్టం ఉందన్నారు. నదిలోకి 3,900 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుందని తెలిపారు. ఎడమ ప్రధాన కాలువ ద్వారా 690 క్యూసెక్కులు, కుడి ప్రధాన కాలువ ద్వారా 119 క్యూసెక్కుల నీటిని విడిచిపెట్టామన్నారు. దిగువ నదిలోకి 2,800 క్యూసెక్కుల నీటిని వెళ్తున్నట్లు చెప్పారు.

బాలింతల మృతిపై విచారణ



విచారణ చేపడుతున్న విచారణ కమిటీ సభ్యులు

సారవకోట: మండలంలోని బుడితి సీహెచ్‌సీలో ప్రసూతి ఆపరేషన్ వికటించడంతో బాలింతల మృతిపై జిల్లా కమిటీ గురువారం విచారణ చేపట్టింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఒక గైనకాలజిస్టు, అనస్తీషియా డాక్టర్, ఎండీ జనరల్ మెడిసిన్ వైద్యులు విచారణలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆస్పత్రిలో ప్రసూతి ఆపరేషన్ చేసిన వైద్యురాలు శోభారాణి, ఇతర సిబ్బందిని విచారించారు. అలాగే మృతి చెందిన వాళ్ల గర్భవతిగా ఉన్ననాటి నుంచి ఆస్పత్రిలో పొందుతున్న సేవలు, వారి కేస్ షీట్‌లను క్షుణ్ణంగా పరిశీలించారు. పూర్తిస్థాయి నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు.

రెండు కిలోల గంజాయితో ముగ్గురి పట్టివేత

కాశీబుగ్గ: పలాస రైల్వేస్టేషన్‌లో ముగ్గురు రెండు కిలోల గంజాయితో గురువారం దొరికారు. డీఎస్పీ వెంకటఅప్పారావు వివరాలు వెల్లడించగా సీఐ సూర్యనారాయణ నిందితులను పాత్రికేయుల ముందుకు తీసుకువచ్చారు. పోలీసుల వివరాల ప్రకారం.. పలాస మండలం, కాశీబుగ్గ టౌన్, పద్మనాభపురం కాలనీకి చెందిన మామిళ్ల మల్లేశ్వరరావు, మంచిర్యాల జిల్లా తెలంగాణ రాష్ట్రానికి చెందిన దుర్గం రఘు కుమార్, గోదారి స్వామీలు ముగ్గురు విజయవాడలో క్యాటరింగ్ షాపులో పనిచేసుకుంటూ స్నేహితులయ్యారు. ముగ్గురూ కలిసి ఒడిశా రాష్ట్రం పూరిలో జగన్నాథ స్వామి రథయాత్రకు వెళ్లి తిరిగి వచ్చేటప్పుడు వీరికి ఉన్న అలవాట్లకు వాడుకోవడానికి గంజాయి తీసుకువచ్చారు. తెలంగాణ చెందిన ఇద్దరు వ్యక్తులు వారి ప్రాంతంలో చిన్నచిన్న ప్యాకెట్లుగా చేసి అమ్ముకునేందుకు, బరంపురంలో రైల్వే స్టేషన్ నుంచి ఒక ఆటో డ్రైవరుతో గుర్తుతెలియని వ్యక్తి వద్ద రెండు కిలోల గంజాయిని కొనుగోలు చేసి పద్మనాభపురం కాలనీలో మల్లేష్ ఇంటికి వచ్చి, తిరిగి వారి గ్రామం వెళ్లేందుకు బయల్దేరారు. ముగ్గురు మోటార్ సైకిల్ పై పలాస రైల్వే స్టేషన్‌కు వెళుతుండగా పోలీసుల తనిఖీల్లో పట్టుబడ్డారు. కేసు నమోదు చేసి నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.



విద్యార్థుల కష్టాలు

నరకానికి నకలు

చిన్నపాటి చినుకు పడితే దమ్ముమడిలా కనిపిస్తున్న ఆంజనేయపురం రహదారి

ఫొటో చూసి ఏరు ఎండిపోయిందనుకునేరు. ఇది ఏరు కాదు దారి. టెక్కలి మేజర్ పంచాయతీ పరిధి ఆదిఆంధ్రవీధి నుంచి ఆంజనేయపురం వెళ్లే దారి ఇలా దమ్ము మడిని తలపిస్తోంది. ఈ దారి గుండా నిత్యం విద్యార్థులు కాలేజీలకు, స్కూళ్లకు వెళ్తుంటారు. ఎక్కడికక్కడ గోతులు పడి చిన్న చినుకులకే కాలువలా మారిపోయే దారి గుండా ప్రయాణించడం నరకప్రాయంగా ఉందని వారు చెబుతున్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులకు ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నువ్వుగుడ్డి, సవర గోపాలపురం, చిన్నకేదారి, పెద్దకేదారి, దబ్బగుడ్డి, దమర తదితర గిరిజన గ్రామాలకు వెళ్లేందుకు ఇదే ప్రధాన దారి కావడంతో నిత్యం అవస్థలు తప్పడం లేదు. దారి నిర్మించకుండా రోడ్డుకు ఇరువైపులా మట్టిపోసి ఎత్తు చేయడంతో ఈ పరిస్థితి దాపురించిందని స్థానికులు చెబుతున్నారు.

– టెక్కలి రూరల్

నడిచి వెళ్లలేకపోతున్నాం...



మా కాలేజీకి వెళ్లాలంటే ఈ దారి గుండానే వెళ్లాలి. ఆంజనేయపురం నుంచి ఆదిఆంధ్రా వీధి వరకు ఒక్కసారైనా జారిపడకుండా ఎవరూ వెళ్లలేరు. వర్షం పడిందంటే ఇక నరకమే.

– ముదిదాన హేమసుందర్, విద్యార్థి, ఆంజనేయపురం గ్రామం



జారిపడేపోయే స్థితిలో అతి కష్టంమీద వెళ్తున్న వాహనదారులు

మన జీడి రుచికి దేశం ఫిదా

- సిక్కోలు జీడిపప్పునకు జాతీయ అవార్డు
- 14న ఢిల్లీలో అవార్డు స్వీకరించనున్న కలెక్టర్



శ్రీకాకుళం పాతబస్టాండ్:

మన జీడి అరుదైన ఘనత సాధించింది. వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్ కార్యక్రమంలో భాగంగా పలాస జీడిపప్పునకు జాతీయ స్థాయిలో ఉత్తమ అవార్డు–2025 లభించింది. ఈ నెల 14న ఢిల్లీలో జరగనున్న జాతీయ స్థాయి అవార్డుల ప్రదానోత్సవానికి కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జిల్లా ఉద్యాన అధికారి రత్నాల వరప్రసాద్ హాజరు కానున్నారు.

జిల్లా మొత్తం 24,000 హెక్టార్లలో జీడి సాగవుతోంది. ఇందులో 22,000 హెక్టార్ల తోటలు దిగుబడినిస్తున్నాయి. పలాస, మందస, వజ్రపుకొత్తూరు, సోంపేట వంటి ఉద్దానం మండలాల్లో ఎక్కువగా పంట పండిస్తారు. పంట ద్వారా జిల్లాలో 1,05,000 కుటుంబాలు ప్రత్యక్షంగా, పరోక్షంగా జీవనం సాగిస్తున్నాయి. వీరిలో 31,000 మంది సన్నకారు రైతులు, 56,000 మంది చిన్న రైతులు, 18,000 మంది పెద్ద రైతులు ఉన్నారు. 2018 అక్టోబర్‌లో వచ్చిన తిత్లీ తుఫాను జిల్లా ఉద్యాన పంటలకు తీవ్ర నష్టం కలిగించింది. కానీ ఆ నష్టం నుంచి కోలుకుని రైతులు, ఉద్యాన శాఖ అధికారులు ఈ ఘనత సాధించారు. తిరుమల తిరుపతి దేవస్థానం నందు శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ప్రసిద్ధ లడ్డూ ప్రసాదం తయారీలోనూ పలాస జీడిపప్పును వినియోగించడం, ఇక్కడి జీడిపప్పుకు జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు తీసుకురావడానికి ఒక కారణమైంది. పలాస నుంచి ప్రతి రోజూ సుమారు 3000 కిలోల జీడిపప్పును స్వామివారి వివిధ ప్రసాదాల తయారీకి పంపిస్తున్నారు.

కొత్త ఒరవడితో..

పలాస మండలం బొడ్డపాడు గ్రామానికి చెందిన కుత్తుమ వేమన్న అనే రైతు ప్యాక్ హౌస్, కొత్త టెక్నాలజీ ఉపయోగించి తన ఆదాయాన్ని రూ.7.6 లక్షల నుంచి రూ.11.8 లక్షల వరకు పెంచుకున్నారు. ఇది జిల్లాలో మారుతున్న వ్యవసాయ విధానాలకు నిదర్శనం. ఉద్యాన శాఖ ద్వారా ఓడి ఓపీ ప్రాథమిక నివేదికను చేనేత, జౌళి శాఖ సహకారంతో అక్టోబర్ 2024లో సమర్పించగా, ఫిబ్రవరి 2025లో కేంద్రం నుంచి అధికార బృందం పలాస ప్రాంతంలో జీడి తోటలు, ప్రాసెసింగ్ యూనిట్లను విస్తృతంగా పరిశీలించింది. జాతీయ అవార్డు రావడంతో వీరి కృషి దేశవ్యాప్తంగా గుర్తింపు పొందింది.

గొప్పలు చెప్పి.. లోపాలు దాచి

- మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌లో కనిపించిన లోపాలు



గార : విద్యార్థి ప్రోగ్రెస్ కార్డు పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు, కలెక్టర్ స్వప్నిల్ దినకర్‌పుండ్కర్

శ్రీకాకుళం: జిల్లా వ్యాప్తంగా పాఠశాలలో గురువారం పేరెంట్స్ టీచర్ మీటింగ్‌లు జరిగాయి. పాఠశాలలన్నీ హడావుడిగా కనిపించాయి. ఈ హడావుడి మాటున కొన్ని నిజాలు దాగుండిపోయాయి. కేవలం రికార్డు కోసం గురువారం ఉపాధి పనికి సెలవు ఇచ్చేశారు. పరపతి నిలబడేందుకు యూనిఫారాలు లేని చోట్ల నానా అవస్థలు పడ్డారు. రూపాయి కూడా విదల్చని ప్రభుత్వ వైఖరితో గురువులు జేబులకు చిల్లులు పెట్టుకున్నారు. జిల్లాలో పలు మండలాలకు యూనిఫారం కిట్లు రాలేదు. దీంతో పాత యూనిఫాంతోనే విద్యార్థులు దర్శనమిచ్చారు. గతంలో యూనిఫాం క్లాత్ మిగిలిపోయేది. ఓ పాఠశాలలో గతంలో వచ్చిన యూనిఫాం క్లాత్‌ను టేబుల్‌క్లాత్‌గా వినియోగించారు.

సీఎస్ఆర్ నిధులతో..

గార: జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలకు కంపెనీల సీఎస్ఆర్ నిధులతో వసతులు కల్పిస్తామని కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. గురువారం గార జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మెగా పేరెంట్ టీచర్స్ మీట్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. తన తండ్రి చదువుకున్న స్కూల్ ఇదని, ఇందులో సోలార్, ప్రయోగశాలలు, ఆట స్థలం అభివృద్ధి చేస్తామన్నారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఏర్పాట్లను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. పా ఠశాల ఆట స్థలంలో చెత్తా చెదారం ఉండటం, స్టేజీ ఏర్పాట్లు బాగోలేకపోవడం, తల్లిదండ్రులు అప్పటికీ ఇంకా హాజరు తక్కువగా ఉండటంతో హెచ్‌ఎం పద్మావతి, ఎంఈఓ ఎస్.రామకృష్ణపై ఆగ్రహం వ్యక్తం చేశారు.



పాత యూనిఫాంలో ఉన్న పిల్లలకు భోజనం వడ్డిస్తున్న ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవి



పొందూరు మండలం రొంపివలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సమావేశానికి జగనన్న యూనిఫామ్, సివిల్ డ్రెస్‌తో హాజరైన విద్యార్థులు

రాజకీయ సమావేశాలను తలపించేలా..

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలో మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్‌లు రాజకీయ సమావేశాలను తలపించాయి. విద్యార్థులకు మంచిచెడులను వివరించి, నాలుగు మంచిమాటలు చెప్పాల్సిన చోట.. తమ నాయకుడు చంద్రబాబు దేవుడని, పేదరికం లేని సమాజం కోసం లోకేష్ కంకణం కట్టుకున్నారంటూ కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు శ్రీకాకుళం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో మాట్లాడడం చర్చనీయాంశమైంది. అనేక చోట్ల ముందు వరుసలో రాజకీయ నాయకులు వెనుక వరుసలో పాఠశాల/కళాశాల అధికారులు కూర్చోవాల్సి వచ్చింది. ప్రభుత్వం కనీస నిధులు విదల్చకపోవడంతో గత్యంతరం లేక గురువులు తమ చేతిచమురు వదిలించుకున్నారు. పలు చోట్ల భోజనాలపై తల్లిదండ్రులు ప్రశ్నించారు. జిల్లాలో ఉన్న నారాయణ, శ్రీచైతన్య విద్యాసంస్థల్లో పీటీఎం సమావేశాల జాడే కనిపించలేదు.

'పాలవలసకు పంపించేది లేదు'



అల్లెన గ్రామంలో ఎంఈఓలను నిలదీసిన తల్లిదండ్రులు

బూర్జ: మండలంలో గల అల్లెన గ్రామ యూపీ స్కూల్ నుంచి పాలవలస జెడ్పీ హైస్కూల్‌కి 6,7,8 తరగతి విద్యార్థులను ఎట్టి పరిస్థితుల్లోనూ పంపించబోమని విద్యార్థుల తల్లిదండ్రులు ఎంఈఓలు ఎస్.శ్యామసుందరరావు, బి.ధనుంజయరావుల వద్ద తేల్చి చెప్పారు. గురువారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న తల్లిదండ్రులు ఇలా తమ అభిప్రాయాన్ని కుండ బద్దలుగొట్టారు.

కరెంట్ కాటుకు విద్యార్థి బలి

- మెగా పీటీఎంకు వెళ్లొచ్చిన కాసేపటికే ఘటన





నవగాపు మహేష్ మృతదేహం (ఇన్‌సెట్లో) మహేష్ (ఫైల్)

మెళియాపుట్టి : మెళియాపుట్టి మండలం గొప్పిలి గ్రామానికి చెందిన ఐదో తరగతి విద్యార్థి నవగాపు మహేష్ (10) విద్యుదాఘాతంతో గురువారం మృతి చెందాడు. గొప్పిలి ప్రభుత్వ పాఠశాలలో గురువారం నిర్వహించిన మెగా పీటీఎంకు హాజరయ్యాడు. స్కూల్‌లో ఇచ్చిన మొక్కను తీసుకుని సాయంత్రం ఇంటి మేడపై ఉన్న కుండీలో నాటేందుకు వెళ్లాడు. అక్కడ పడి ఉన్న జీఏ వైరును తీసి పక్కన పెడదామనుకుని పట్టుకోగా.. షాక్ కొట్టి అక్కడే పడిపోయాడు. శ్లాబ్ గోడకు బలంగా తగలడంతో తీవ్రంగా రక్తస్రావమైంది. మెట్ల నుంచి రక్తం బొట్టుబొట్టుగా రావడం చూసిన కుటుంబ సభ్యులు మేడపైకి వెళ్లేసరికి బాలుడు విగతజీవిగా పడి ఉన్నాడు. బిడ్డ మృతదేహాన్ని చూసి తల్లి గుండెలవిసేలా రోదించింది. విద్యార్థి తండ్రి చంద్రరావు ఇటీవలే మృతిచెందారు. పోలీసులు కేసు నమోదుచేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పాతపట్నం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

'మానసిక ఆరోగ్య కేంద్రాలు మెరుగ్గా పనిచేయాలి'

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో అధిక సంఖ్యలో నమోదవుతున్న మానసిక రోగుల ఆరోగ్య సమస్యల చికిత్సలపై వైద్యులు మరింత చొరవ చూపాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జునైద్ అహ్మద్ మౌలానా సూచించారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు గురువారం ఆయన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు నేతృత్వంలో స్థానిక గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ (జీజీహెచ్) బలగ, రాగోలు జెమ్స్ ఆస్పత్రులను ఆకస్మికంగా సందర్శించారు. జీజీహెచ్‌లో మానసిక వ్యాధిగ్రస్తులతో స్వయంగా మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మానసిక ఆరోగ్య చికిత్సలకు ప్రత్యేక శ్రద్ధ అవసరమని వైద్యులకు సూచించారు. సైకియాట్రిస్ట్‌తో పాటు వైద్య సిబ్బందితో చర్చించి పౌష్టికాహార సరఫరా, చికిత్సా విధానాలపై సమీక్షించారు. రోగులలో ఆత్మస్థైర్యం, మానసిక స్థిరత్వం పెంపొందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఆయన హితవు పలికారు. అనంతరం, ఆసుపత్రిలోని వన్‌స్టాప్ సెంటర్‌ను పరిశీలించారు. 18 ఏళ్లవారు గర్భవతులుగా ఆస్పత్రికి వచ్చినప్పుడు వారిని గుర్తించడంలో మరింత జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. లింగ నిర్ధారణ నిషేధ చట్టానికి సంబంధించిన విషయాలను కూడా అధికారులకు వివరించి, వాటిని పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. రాగోలు జెమ్స్‌లో కూడా ఆయన పర్యటించి మానసిక రోగుల పరిస్థితిని స్వయంగా పరిశీలించారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ అనిత, జెడీ అడ్మిన్ బి.రాజశేఖర్‌రెడ్డి, ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డి.పార్వతి, సైకియాట్రిస్టులు డీవీ పద్మ, ఆర్‌వీఆర్ అభినయ, డి.ప్రవీణ్ కుమార్ తదితరులున్నారు.





అరకొర ఎరువులను అందిస్తున్న దృశ్యం

బారులు తీరితేనే ఎరువులు

నడినెత్తిన చురుక్కుమంటున్న ఎండ.. ఎంతకూ తరగని క్యూ.. కావాల్సింది ఒక యూరియా బస్తా. నించునీ నించునీ విసుగు పుట్టి కాళ్లకు వేసుకున్న చెప్పులను క్యూలో పెట్టారు. దాదాపు ఐదేళ్ల తర్వాత మళ్లీ అన్నదాత లైనులో దీనంగా నించోవాల్సిన అవస్థ ఏర్పడింది. గురువారం జి.సిగడాం మండల కేంద్రంలో రైతు సేవా కేంద్రానికి 440 యూరియా బస్తాలు వచ్చాయి. ఈ గ్రామంలో దాదాపు 13 వందల మంది రైతులు ఉన్నారు. దీంతో ఎవరికి ఎరువులు ఇవ్వాలో అధికారులకు కూడా అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రైతు ఇంటి ముంగిటకే సకాలంలో ఎరువుల, విత్తనాలు ఇచ్చేవారు. ప్రభుత్వం మారడంతో రైతుకు మళ్లీ గత కాలపు అవస్థలు తప్పడం లేదు.

– జి.సిగడాం









ప్రమాదం అంచున..

జిల్లా కేంద్రంలో కొన్ని స్కూల్ ఆటోలు ప్రమాదకర రీతిలో ప్రయాణం సాగిస్తున్నాయి. కొందరు డ్రైవర్లు నిబంధనలకు విరుద్ధంగా ఫ్రంట్ సీటుపై, వెనుక డోర్‌పై విద్యార్థులను తీసుకెళ్తున్నారు. ఏమాత్రం ఆదమరిచినా, సడన్ బ్రేక్ వేసినా చిన్నారులు కిందపడి గాయాలపాలవడం ఖాయం. ఎటువంటి ప్రమాదం జరగకముందే ఇలాంటి ప్రయాణాలను అరికట్టాల్సిన అవసరం అధికారులపై ఉంది. - సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం

క్లుప్తంగా

అక్రమ అరెస్టులు ఆపాలి

శ్రీకాకుళం: సోషల్ మీడియాలో పోస్టులు చేస్తున్న వారిని అక్రమ అరెస్టులు చేస్తూ పౌరుల జీవనానికి, స్వేచ్ఛకు కూటమి ప్రభుత్వం భంగం కలిగిస్తోందని అంతర్జాతీయ మానవహక్కుల సంఘం స్టేట్ సివిల్ రైట్స్ చైర్మన్ కరణం తిరుపతి నాయుడు గురువారం తెలిపారు. సోషల్ మీడియా అరెస్టులపై సుప్రీం కోర్టు మార్గదర్శకాలు జారిచేసినా ప్రభుత్వం పాటించట్లేదన్నారు. జిల్లాలో మంత్రి అచ్చెన్నాయుడు అరాచకాలు ఎక్కువయ్యాయని, ప్రతిపక్షాలపై తప్పుడు ఆరోపణలు, తప్పుడు కేసులు బనాయించి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అక్రమ అరెస్టులను ఆపాలని డిమాండ్ చేశారు.

రెండు లారీలు ఢీ



సహాయక చర్యలు చేపడుతున్న పోలీసులు

రణస్థలం: పతివాడపాలెంలో జాతీయ రహదారిపై రెండు లారీలు ఢీకొట్టుకున్నట్లు జె.ఆర్.పురం పోలీసులు తెలిపారు. విశాఖపట్నం వైపు నుంచి శ్రీకాకుళం వైపు ముందు వెళుతున్న లారీని వెనుక నుంచి వస్తున్న మరో లారీ బలంగా ఢీకొట్టింది. గురువారం తెల్లవారుజామున జరిగిన ఈ ప్రమాదంలో క్లీనర్, డ్రైవర్లు స్వల్పగాయాలతో బయటపడ్డారని జె.ఆర్.పురం ఎస్సై ఎస్.చిరంజీవి తెలిపారు. హైవే పెట్రోలింగ్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని లారీని క్రేన్ సహాయంతో పక్కకు తొలగించారు.

డిజిగ్నేషన్ మార్చాలని వినతి



డైరెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాంట్రాక్ట్ గెస్ట్ లెక్చరర్లు

ఎచ్చెర్ల: తమకు గెస్ట్ ఫ్యాకల్టీ పేరిట డిజిగ్నేషన్ ఇచ్చి అన్యాయం చేశారని, తమ డిజిగ్నేషన్‌ను కాంట్రాక్ట్ లెక్చరర్, అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా మార్చాలని కాంట్రాక్ట్ గెస్ట్ లెక్చరర్లు రెడ్డి లక్ష్మణరావు, వై.నారాయణరావు, పి.నవీన్ కోరారు. ఈ మేరకు గురువారం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఐఐఐటీ) డైరెక్టర్ కేవీజీడీ బాలాజీకు వినతిపత్రం అందించారు. 2018కి ముందు, తర్వాత రిక్రూట్‌మెంట్ అయినవారికి రూ.40 వేలు జీతం ఇస్తున్నామ, తమకు మాత్రం రూ.25 వేలకే పరిమితం చేశారన్నారు. ఈ విషయమై అనేకసార్లు వినతిపత్రం అందించినా ఇప్పటివరకూ న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను చాన్సలర్ మధుమూర్తి, రిజిస్ట్రార్ అమరేంద్రల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని వారు కోరారు.

గిరి ప్రదర్శనకు వెళ్లి వస్తూ..



ఉదయ్‌కుమార్(ఫైల్)

నరసన్నపేట: మాకివలసలో గ్రామానికి చెందిన రావాడ ఉదయకుమార్ (28) రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. గురువారం సింహాచలం గిరి ప్రదర్శనకు వెళ్లి ద్విచక్ర వాహనంపై తిరిగి స్వగ్రామం వస్తుండగా భోగాపురం వద్ద అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టాడు. ఈ ఘటనలో ఉదయకుమార్ అక్కడికక్కడే మృతి చెందగా మరొకరికి గాయాలయ్యాయి. విషయం తెలియడంతో తండ్రి రమణయ్య, కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఉదయ్‌కుమార్ డిగ్రీ పూర్తి చేసి ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నాడు. ఇంతలోలో మృతి చెందడంతో అందరూ విషాదంలో మునిగిపోయారు.

పీ-4 విధానంపై సమీక్ష

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో పీ4 (ప్రభుత్వం-ప్రైవేటు-ప్రజలు- భాగస్వామ్యం) కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు గురువారం ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి విజయానంద్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ దొనక పృథ్విరాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బాక్సింగ్ క్రీడాకారుల ఎంపిక

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాస్థాయి సబ్-జూనియర్ బాలబాలికల బాక్సింగ్ ఎంపిక పోటీలు గురువారం ఉత్సాహభరితంగా సాగాయి. జిల్లా కేంద్రంలోని కోడిరామ్మూర్తి స్టేడియం వేదికగా జరిగిన ఈ ఎంపికల్లో ప్రతిభ కనబర్చిన తొమ్మిది మంది క్రీడాకారులను రాష్ట్రపోటీలకు ఎంపిక చేశారు. ఈ పోటీలు విశాఖపట్నంలోని రైల్వేస్టేడియం వేదికగా ఈ నెల 12,13 తేదీల్లో జరగనున్నాయని జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బీఏ లక్ష్మణ్ దేవ్ తెలిపారు. కార్యక్రమంలో డీఎస్‌డీఓ డాక్టర్ కె.శ్రీధర్‌రావు, బాక్సింగ్ కోచ్ పి.ఉమామహేశ్వరరావు, అసిస్టెంట్ కోచ్ రాజీవ్, సీనియర్ బాక్సర్లు పాల్గొన్నారు. బాలుర విభాగంలో పీకే దుర్గాప్రసాద్, జి.శంకర్ నారాయణ, కె.ఎస్.కుమార్, కె.వరుణ్ తేజ, బి.దేవన్‌కుమార్, ఎమ్మెస్ ప్రకాష్, ఎం.సూర్యతేజ, బాలికల విభాగంలో డి.సత్య తేజశ్విని, బీఎస్ఎస్ రాణి ఎంపికయ్యారు.

ఆదిత్యాలయంలో.. విజిలెన్స్ టెన్షన్!

- రిటైర్డ్ ఈవోతో పాటు పలువురు సిబ్బందికి విజిలెన్స్ పిలుపు
- ఇప్పటికే అక్రమాలపై ఆధారాలను సమర్పించిన సీనియర్ అసిస్టెంట్
- కొత్త ఈవోకు తప్పని పాత తలనొప్పులు



అరసవల్లి:

ప్రత్యక్ష దైవం అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో కొందరు ఉద్యోగులకు విజిలెన్స్ టెన్షన్ పట్టుకుంది. దొంగ బిల్లులతో రూ.లక్షల్లో అక్రమాలు చేసిన వారందరికి విజిలెన్స్ 'పిలుపులు' వణుకు పుట్టిస్తున్నాయి. గతంలో ఈవోగా పనిచేసిన చంద్రశేఖర్ హయాంలో రిటైర్డ్ ఈవో జగన్మోహనరావు, ఓ జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగిణి సహకారంతో పాటు కంప్యూటర్ ఆపరేటర్, మరో దినసరి వేతనదారుడు కలిసి దొంగ బిల్లులతో తప్పుడు లెక్కలతో రూ.లక్షలు దోచుకున్నట్లుగా అభియోగాలున్నాయి. దీనిపై ఏడాది నుంచి పలు దఫాలుగా 'సాక్షి'లో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. దీన్ని ఆధారంగా చేసుకుని ఇక్కడే సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేసి సస్పెన్షన్‌లో ఉన్న కృష్ణమాచార్యులు అనే ఉద్యోగి... ఆలయంలో జరిగిన అక్రమాలపై పూర్తి ఆధారాలతో విజిలెన్స్, ఏసీబీ అధికారులకు కూడా ఫిర్యాదు చేశారు. ఈ ఏడాది రథసప్తమి తర్వాత విజిలెన్స్ అధికారులు అరసవల్లి ఆలయంపై ప్రత్యేక దృష్టి సారించి అక్రమాలపై వచ్చిన ఫిర్యాదులన్నీ వాస్తవమే అని నిర్ధారించుకుని విచారణ చేపట్టారు.

విజిలెన్స్ అధికారులకే టోపీ!

ఆలయంలో అక్రమాలపై విజిలెన్స్ అధికారులు ఇక్కడి వ్యయ ఖర్చుల రికార్డులను పరిశీలించే ప్రయత్నం చేయగా.. అరసవల్లి నుంచి విజయనగరం మాన్సాస్‌కు బదిలీ అయిన ఓ ఉద్యోగి దగ్గరే రికార్డులు న్నాయని, ఇంకా అప్పగించలేదంటూ ఇక్కడ పనిచేసిన ఓ మహిళా జూనియర్ అసిస్టెంట్ పక్కా ప్రణాళికతో విజిలెన్స్ అధికారులకే టోపీ పెట్టారు. తీరా ఇప్పుడు చూస్తే...అప్పట్లో మాన్సాస్‌కు వెళ్లిన ఉద్యోగి మళ్లీ తాజా బదిలీల్లో అరసవల్లిలో విధుల్లో చేరిపోగా..ఇక్కడ పనిచేసిన మహిళా ఉద్యోగి ఎంచక్కా మాన్సాస్ సంస్థకు బదిలీ చేయించుకున్నారు. దీంతో విజిలెన్స్‌కు రికార్డులను అప్పగించే విషయంలో అధికారులకు మళ్లీ ఎదురుచూపులు తప్పలేదు. ఇదిలా ఉండగా, ఇక్కడి అక్రమాలపై విజిలెన్స్ అధికారుల బృందం పక్కా నిర్ధారణకు వచ్చినట్లు తెలిసింది. దీనికి తోడు రిటైర్డ్ ఈవో జగన్మోహనరావు భక్తుల పేరిట రూ.లక్షల్లో దొంగ బిల్లులను రెగ్యులర్ ఉద్యోగుల పేర్లతో చెక్కులు విత్‌డ్రా చేయించుకున్నారనే ఆరోపణలున్నాయి. శిమ్మ మల్లేశ్వరరావు తదితర రెగ్యులర్ ఉద్యోగులను ఇప్పటికే విజిలెన్స్‌అధికారులు పిలిపించి విచారించగా ఆధారాలతోసహా చెప్పేసినట్లుగా సమాచారం. తమకు తెలియకుండా తమ పేర్లతో చెక్కులను సిద్ధం చేసి అక్రమంగా డబ్బులు విత్‌డ్రా చేశారని విజిలెన్స్ అధికారుల ఎదుట వాంగ్మూలం ఇచ్చినట్లుగా విశ్వసనీయంగా తెలిసింది. దీన్నిబట్టి మరికొందరు దినసరి వేతనదారులు కూడా తమకు తెలియకుండా తమ పేర్లతో చెక్కు లు ఇచ్చేశారంటూ వాంగ్మూలాలను ఇచ్చేం దుకు సన్నద్ధమవుతున్నట్లుగా సమాచారం.

కొత్త ఈవోకు అవస్థలు..

అరసవల్లి ఆలయానికి విజిలెన్స్ తనిఖీలు, అక్రమాలపై నిర్ధారణ తదితర అంశాలు ఇటీవల ఈవోగా బాధ్యతలు చేపట్టిన కె.ఎస్.వి.డి.వి.ప్రసాద్‌కు తలనొప్పిగా మారింది. తన హయాంలో జరగకపోయినా ఆలయంలో పనిచేస్తున్న ఉద్యోగ సిబ్బందిలో ఎక్కువమంది విజిలెన్స్ పిలుపులతో టెన్షన్ పడుతుండటంతో ఆలయ పాలన వ్యవహారాలకు అడ్డంకిగా మారింది. దినసరి వేతనదారులపైనే ఆధారపడిన వ్యవహారాలుండటంతో కొత్త ఈవోకు ఇబ్బందులుగా తయారయ్యాయి.

సహకరించరూ..

రూ.లక్షల్లో అక్రమాల ఆరోపణలు ఎదుర్కొంటున్న తరుణంలో తమకు అనుకూలంగా విజిలెన్స్ అధికారులకు వాంగ్మూలాలు ఇవ్వాలంటూ రిటైర్డ్ ఈవో జగన్మోహనరావు, మహిళా జూనియర్ అసిస్టెంట్ పలువురి వద్ద ప్రాధేయపడుతున్నట్లు తెలుస్తోంది. కొద్ది రోజుల్లో తనకు కమిషనర్ ఆర్డర్ కాలపరిమితి ముగిసిపోతుందని, అంతవరకు తనపై ఎలాంటి చర్యలు లేకుండా రిటైర్డ్ ఈఓ పావులు కదుపుతున్నారని సమాచారం.

అక్రమాలపై ఆరా..

భక్తులకు మజ్జిగ, పాలు పంపిణీ చేసినట్లుగా రూ.2.50 లక్షలు, వాహనాల పెట్రోల్ బిల్లుల పేరిట రూ.3 లక్షలు, స్వామి వారి అలంకరణకు పువ్వుల పేరిట రూ.3 లక్షలు, శేషవస్త్రాలు పేరిట అప్పటి ఈవో సతీమణికి పట్టు చీరలు రూ.2 లక్షలు, ఉచిత ప్రసాదాలు పంపిణీ, పారిశుద్ధ్య నిర్వహణ, మరుగుదొడ్ల నిర్వహణ లేబర్‌కు రూ.6 లక్షల వరకు ఖర్చుల్లో అక్రమంగా బిల్లులు పెట్టి నొక్కేసినట్లుగా జోరుగా ప్రచారం జరుగుతోంది. వీటితో పాటు అక్రమంగా డిప్యుటేషన్‌పై వచ్చిన అటెండర్ శ్రీనివాసరావుకు పీఆర్సీ ఎరియర్స్‌తో (2022 ఆగస్టు1 నుంచి 2024 ఆగస్టు 31 వరకు) కలిపి రూ.5.72 లక్షల ఆలయ నిధుల నుంచి ఇప్పించిన వ్యవహారంపై కూడా విజిలెన్స్ ఆరా తీస్తోంది.

లారీని ఢీకొట్టిన ఆటో

- రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి, నలుగురికి గాయాలు
- ధర్మలక్ష్మీపురంలో విషాదఛాయలు



ఘటనా ప్రదేశంలో లారీ, ఆటో



అమ్మన్నమ్మ (ఫైల్)

సారవకోట : చిన్నకిట్టాలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఎదురుగా గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ధర్మలక్ష్మీపురం గ్రామానికి చెందిన రంగాల అమ్మన్నమ్మ (73) అనే వృద్ధురాలు మృతి చెందింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. ధర్మలక్ష్మీపురం గ్రామానికి చెందిన దువ్వారి సంతోష్ కుమార్ ఆటోలో జామాన వరహాలు, రంగాల అమ్మన్నమ్మ, దువ్వారి తులసి కుమార్, ఎన్ని భారతిలు గురువారం నరసన్నపేటలో నిర్వహించిన సదరం దివ్యాంగుల పరిశీలనకు వెళ్లారు. అక్కడి వైద్యులు పరీక్షించాక తిరిగి ధర్మలక్ష్మీపురం వస్తుండగా చిన్నకిట్టాలపాడు స్కూల్ ఎదురుగా ఆగి ఉన్న లారీని బలంగా ఢీకొట్టారు. ఈ ఘటనలో అందరూ గాయపడటంతో హైవే అంబులెన్స్, 108 వాహనంలో నరసన్నపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం శ్రీకాకుళం సర్వజన ఆసుపత్రికి తరలించారు. అక్కడ అమ్మన్నమ్మ చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆటో డ్రైవర్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. విషయం తెలుసుకున్న సారవకోట పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

రానని చెప్పినా..

జామాన వరహాలమ్మ, రంగాల అమ్మన్నమ్మలు అక్కాచెల్లెళ్లు. దివ్యాంగురాలైన వరహాలమ్మ భర్త కొన్నేళ్ల క్రితం మృతి చెందడంతో గ్రామంలో ఒంటరిగా ఉంటోంది. సదరం పరిశీలనకు తోడుగా రావాలని అమ్మన్నమ్మను వరహాలమ్మ కోరగా తొలుత రానని నిరాకరించింది. అయినప్పటికీ వరహాలమ్మ పట్టుబట్టడంతో అమ్మన్నమ్మ ఆటోలో బయల్దేరింది. అనుకోని ప్రమాదంలో మృత్యువాతపడింది.

మానవత్వం చాటుకున్న ఎస్ఐ..

రోడ్డు ప్రమాదంలో గాయాలపాలైన వారిని రెండు అంబులెన్స్‌లలో తీసుకుళ్తున్న విషయం తెలుసుకున్న జలుమూరు ఎస్ఐ అశోక్‌బాబు వారితో నరసన్నపేట వెళ్లారు. అక్కడ క్షతగాత్రులని అంబులెన్స్‌లో నుంచి దించి స్ట్రెక్చర్‌పై స్వయంగా తీసుకెళ్లి ఆస్పత్రిలో చేర్పించారు.

మోసం చేయడమే చంద్రబాబు నైజం



నీలమణిదుర్గ ఆలయ సన్నిధిలో వైఎస్సార్‌సీపీ నాయకులు కుంభా రవిబాబు, తమ్మినేని సీతారాం, ధర్మాన కృష్ణదాస్, రెడ్డి శాంతి, దుంపల లక్ష్మణరావు తదితరులు

హిరమండలం: ఎప్పుడు ఎన్నికలు జరిగినా వందలాది హామీలు ఇవ్వడం, అధికారంలోకి వచ్చాక తర్వాత వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేయడం చంద్రబాబునాయుడుకు అలవాటుగా మారిందని ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ శ్రీకాకుళం పార్లమెంట్ పరిశీలకుడు కుంభా రవిబాబు విమర్శించారు. పాతపట్నం నియోజకవర్గ కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి అధ్యక్షతన నిర్వహించిన 'బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ ' కార్యక్రమానికి విచ్చేసిన ఆయన పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, శ్రీకాకుళం పార్లమెంటరీ సమన్వయకర్త తమ్మినేని సీతారాంతో కలిసి గురువారం నీలమణిదుర్గ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో టీడీపీ కూటమి, అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా హామీలు అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నారని దుయ్యబట్టారు. ఏడాదికే చంద్రబాబు పాలనపై ప్రజలు విసిగెత్తిపోయారని, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనలకు వస్తున్న ప్రజాదరణ చూసి కూటమి నాయకులు తట్టుకోలేకపోతున్నారని పేర్కొన్నారు. చంద్రబాబు మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాసిన బాధ్యత వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై ఉందన్నారు. సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం పేరిట ఇంటింటికి వస్తున్న టీడీపీ నాయకులను నిలదీయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం చేసిన మోసాలను ప్రజలకు వివరించడానికికే 'బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ ' కార్యక్రమంతో వైఎస్సార్‌సీపీ ప్రజల్లోకి వస్తోందన్నారు.

దూసుకొచ్చిన మృత్యువు



మృతి చెందిన పరమేశ్వర రెడ్డి

రణస్థలం : రణస్థలం మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా, మరో వ్యక్తి గాయపడ్డాడు. జె.ఆర్.పురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోల్‌కతా నుంచి ముంబై వైపు పైపుల లోడుతో వెళ్తున్న ఐషర్ వ్యాన్ రణస్థలం వద్దకు వచ్చేసరికి అదుపు తప్పి అవతల వైపు రోడ్డుపైకి దూసుకెళ్లింది. ఆ సమయంలో విశాఖ వైపు నుంచి శ్రీకాకుళం వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో బైక్ వెనుక కూర్చున్న ధర్మల పరమేశ్వర రెడ్డి(34) అక్కడికక్కడే మృతి చెందగా డ్రైవింగ్ చేస్తున్న కనకరాజుకు తీవ్ర గాయాలయ్యాయి. మృతుడి స్వగ్రామం రాజాం. మెడికల్ రిప్రజెంటేటివ్‌గా పనిచేస్తూ వృత్తిరీత్యా పాత్రునివలస సమీపంలో, విశాఖపట్నంలోనూ ఉంటున్నాడు. ప్రస్తుతం కుటుంబ సభ్యులు విశాఖపట్నంలోనే ఉంటున్నారు. భార్య ఇందు, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఘటనా స్థలాన్ని జె.ఆర్.పురం ఎస్సై ఎస్.చిరంజీవి పరిశీలించారు. కేసు దర్యాప్తు చేపడతామని ఎస్సై ఎస్.చిరంజీవి తెలిపారు.

మిస్టర్ ఆంధ్ర బాడీబిల్డింగ్ పోటీలకు ఎంపిక

శ్రీకాకుళం న్యూకాలనీ: వైఎస్సార్ కడప జిల్లా వేదికగా ఈ నెల 13న జరిగే మిస్టర్ ఆంధ్రా బాడీబిల్డింగ్ పోటీల్లో పాల్గొనే జిల్లా క్రీడాకారుల ఎంపిక గురువారం స్థానిక వ్యాయామశాలలో నిర్వహించారు. అవినాష్ (పలాస-60కేజీలు), శివ (పలాస-65కేజీలు), బ్రహ్మం (పలాస-75 కేజీలు), వైకుంఠం (శ్రీకూర్మం-55 కేజీలు), ప్రేమ్‌కుమార్ (ఆమదాలవలస-55 కేజీలు), కోటేశ్వరరావు (శ్రీకాకుళం-60 కేజీలు), రాకేష్ (శ్రీకాకుళం-65 కేజీలు), దిలీప్ (శ్రీకాకుళం-50 కేజీలు) రాష్ట్రపోటీలకు ఎంపికైనట్టు వి.విజయ్‌కుమార్ తెలిపారు. వీరిని సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర,జిల్లా ప్రధాన కార్యదర్శి సూర శ్రీనివాసరావు అభినందించారు. రాష్ట్రపోటీలకు వెళ్లేందుకు అవసరమైన సాయాన్ని అందించారు. కార్యక్రమంలో శ్రీకాకుళం స్టార్ బాడీ బిల్డింగ్ అసోసియేషన్ సెక్రటరీ వి.విజయకుమార్, ది ఆంధ్ర బాడీబిల్డర్స్ అసోసియేషన్ కె.గౌరీశంకర్, పవర్ హౌస్ జిమ్ అధినేత రాజు, శ్రీకాకుళం సీనియర్ బాడీబిల్డర్ దుమ్ము అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేత పొలానికి సీసీ రోడ్డు

- కావుగోదాయవలసలో ప్రభుత్వ నిధుల దుర్వినియోగం
- ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు



టీడీపీ నేతకు చెందిన వ్యవసాయ పొలానికి వేసిన సీసీ రోడ్డు నిర్మాణాన్ని చూపిస్తున్న గ్రామస్తులు

సంతబొమ్మాళి : ప్రభుత్వం తలపెట్టిన పల్లె పండుగ కార్యక్రమం కొందరు టీడీపీ నేతలకు కాసులు పంటగా మారింది. సంతబొమ్మాళి మండలం కావుగోదాయవలసలో టీడీపీ నాయకుడు కుత్తుమ శివప్రసాద్ ప్రభుత్వ నిధులతో తన సొంత పొలం చుట్టూ సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టడంపై స్థానికుల నుంచే కాకుండా సొంత పార్టీ నాయకుల నుంచి కూడా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. 9999005243010 వర్క్ ఐడీతో అంగ రామ్మూర్తి ఇంటి నుంచి కుత్తుమ శివప్రసాద్ వ్యవసాయ పొలం వరకు రూ.15లక్షలు ఉపాధి నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. గ్రామస్తుల నుంచి విమర్శలు, పత్రికల్లో కథనాలు రావడంతో ఆ రోడ్డును కలుపుతూ శ్మశాన వాటిక వరకు రోడ్డు నిర్మాణానికి అదనంగా మరో రూ.20లక్షలు ఉపాధి నిధులు మంజూరు చేశారు. అయితే ఈ పనులు ఇష్టారాజ్యంగా చేపట్టారు. ఒకచోట 18 అడుగులు ఉంటే మరోచోట 9 అడుగులు, మరోచోట 7 అడుగులు వెడల్పుతో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. అంతటితో ఆగకుండా శివప్రసాద్ పొలం వద్ద ధాన్యం నూర్పుకు సిమెంట్ ప్లాట్ ఫారమ్ సైతం ప్రభుత్వ నిధులతోనే చేపట్టారు. వైఎస్సార్‌సీపీ నాయకుల పొలం వద్ద 18 అడుగుల మేర సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టారు. టీడీపీ నేత పొలం వద్ద 11 అడుగుల వరకు గ్రావెల్ రోడ్డు ఉంటే ఏడున్నర అడుగులు మాత్రమే సీసీ రోడ్డు నిర్మించారు. ఇదేంటని ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు పెట్టి రౌడీషీట్ తెరిపిస్తానని బెదిరింపులకు పాల్పడుతున్నారు. గతంలో సదరు టీడీపీ నేత చేసిన పనులపై నిలదీయడంతో 12 కుటుంబాలపై పోలీస్ కేసు నమోదు చేయించారని, చదువుకున్న యువకులపై కూడా పోలీస్ కేసు నమోదు చేయించి ప్రశాంతంగా ఉన్న పల్లెల్లో వర్గాలుగా చేశారని గ్రామస్తులు వాపోతున్నారు.

పోలీసులకు ఫిర్యాదు..

ప్రభుత్వ నిధులతో ఇష్టానుసారంగా సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టడంపై విలేకరులతో కలిసి వైఎస్సార్‌సీపీ నాయకుడు, గ్రామస్తులు పనులను పరిశీలించడానికి వెళ్లారు. అక్కడ వాస్తవాలు తెలుసుకొని తిరిగి వస్తుండగా టీడీపీ నేత శివప్రసాద్ తన సెల్ ఫోన్‌లో వీడియోలు తీశారు. పనులు అడ్డుకున్నారంటూ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ నాయకుడు అంగ జనార్దన్ స్టేషన్‌కి వెళ్లి గ్రామానికి జరిగిన అన్యాయాన్ని ఎస్ఐ సింహాచలంకు వివరించారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

ప్రశ్నిస్తే కేసులు..



టీడీపీ నేత కుత్తుమ శివ ప్రసాద్ చేస్తున్న అన్యాయాలపై ప్రశ్నిస్తే పోలీసు కేసులు నమోదు చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వైఎస్సార్‌సీపీకి అనుకూలంగా ఉన్నారని 12 తాగునీటి కుళాయిలు తొలగించారు. రూ.15 లక్షలు ఖర్చుచేసి రామాలయం నిర్మాణం చేపడితే బిల్లులు రాకుండా అడ్డుకున్నారు. ఇప్పుడు ప్రభుత్వ నిధులతో సీసీ రోడ్డును తన పొలాలకు వేయడంపై ప్రశ్నిస్తే వీడియోలు తీసి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

- అంగ లక్ష్మి జనార్దన్, సర్పంచ్, కావు గోదాయవలస

నిబంధనల ప్రకారమే బిల్లులు..

ప్రభుత్వ నిబంధనల ప్రకారమే బిల్లులు చెల్లిస్తాం. సీసీ రోడ్డు నిర్మాణానికి మాత్రమే రికార్డు చేసి బిల్లులు చెల్లిస్తాం. సొంత వ్యవసాయ పొలానికి వేసిన సీసీ రోడ్డుకు మాకు సంబంధం లేదు. దీన్ని మేం రికార్డు చేయం.

- అజిత్‌కుమార్, పంచాయతీరాజ్ ఏఈ, సంతబొమ్మాళి

వ్యక్తి ఆత్మహత్య

రణస్థలం: తెప్పలవలస గ్రామానికి చెందిన బలగ చిన్నారావు(45) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. జె.ఆర్.పురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం ఉదయం ఇంటి వద్ద పురుగుల మందు తాగిన చిన్నారావును పక్కనే ఉన్న బంధువులు గుర్తించి హుటాహుటిన రణస్థలం సామాజిక ఆసుపత్రికి తరలించారు. మార్గమధ్యలోనే చిన్నారావు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలోనే పురుగుల మందు తాగినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. చిన్నారావు భార్య కళావతి పాఠశాల వంట నిర్వాహకురాలిగా పని చేస్తోంది. వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జె.ఆర్.పురం ఎస్సై ఎస్.చిరంజీవి తెలిపారు.

వివాహితపై హత్యాయత్నం

పాతపట్నం: వివాహితపై ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు హత్యాయత్నానికి పాల్పడటం కలకలం రేపింది. పాతపట్నం ఆస్పత్రి కూడలి సమీపంలో సహారా కార్యాలయం వద్ద రెండో ఫ్లోర్‌లో ఒడిశా రాష్ట్రం ఉప్పలాడకు చెందిన తల్లీకుమార్తెతో పాటు నెల రోజుల పాప నివాసముంటున్నారు. గురువారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో తల్లి పక్కనేఉన్న మార్కెట్‌కు వెళ్లింది. ఆ సమయంలో ఇంట్లోకి ముగ్గురు వ్యక్తులు మాస్కులు ధరించి చొరబడ్డారు. వెంటనే తల్లికి ఫోన్ చేసి గుర్తు తెలియని వ్యక్తులు వచ్చారని తెలిపింది. ఇంతలో ముగ్గురు వ్యక్తులూ మహిళను బెడ్‌రూమ్‌లోకి తీసుకువెళ్లి ఫ్యాన్‌కు తాడు కట్టి ఉరివేసి వెళ్లిపోయారు. అనంతరం తల్లి వచ్చి ఫ్యాన్‌కు ఉన్న తాడు విప్పడంతో కుమార్తెకు ప్రాణాపాయం తప్పింది. పోలీసులకు సమాచారం అందించడంతో బాధితురాలిని పాతపట్నం సీహెచ్‌సీకి తీసుకువెళ్లి చికిత్స అందిస్తున్నారు. విచారణ జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

పశువులు పట్టివేత

ఎచ్చెర్ల : జలుమూరు నుంచి అలమండకు అక్రమంగా తరలిస్తున్న పశువులను ఎచ్చెర్ల మండలంలోని నవభారత్ జంక్షన్ సమీపంలో ఎచ్చెర్ల పోలీసులు పట్టుకున్నారు. నిందితులపై కేసు నమోదుచేశారు. పట్టుబడిన పశువుల్లో ఆరు ఆవులు, రెండు ఎద్దులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.